(14)



# ధర్మ ప్రభువు

వారణాసిని బ్రహ్మదత్తుడనే మహారాజు పరిపాలిస్తున్నాడు. ఆయన ఉత్తముడు. బాగా చదువుకొన్నవాడు. న్యాయాన్యాయాలను, ఆచి తూచి నిర్ణయించ గలిగినవాడు. పాపభీతి గలవాడు. వీటన్నింటినీ మించి, మానవులంటే ఎంతో ప్రేమానురాగాలున్నవాడు. ఆయన ఏలుబడిలో వారణాసి ప్రజలు సుఖంగా జీవిస్తున్నారు.

కానీ అన్ని రోజులూ ఒక్కలాగా గడవవు కదా. దురదృష్ట వశాత్తూ ఒక సంవత్సరం వానలు పడలేదు. వానలు లేనందుకు బ్రహ్మదత్తుడు కొంత కలవరపడ్డాడు. ప్రజలు కూడా ఆందోళన పడ్డారు,

అయినా ఈ సంవత్సరం గడిచి గట్టెక్కగలమన్న విశ్వాసం వారికున్నది. అంతకు ముందు సంవత్సరం పండిన ధాన్యం ఉన్నది గనక, ఇబ్బందు లేమీ పడ నవసరం లేదనుకొన్నారు. పాతర్లు తీయించారు. నిలవవున్న ధాన్యాలను వాడుకొన్నారు. పెద్ద ఇబ్బంది లేకుండా ఒక ఏడు గడిచి పోయింది.

ఆ మరునటి సంవత్సరం కూడా వానలు పడలేదు. అంటే రెండో ఏట గూడా పంటలేమీ ఉండవన్న, మాట. ఈ గండాన్ని కూడా పెద్ద బాధలులేకుండా బ్రహ్మదత్తుడు గడపగలడు. ఆయన స్వాధీనంలోనే కొన్ని ధాన్యాగారాలున్నాయి. అత్యవసర సమయాల్లో ప్రజలకు ఉపయోగపడతాయని పండిన సంవత్సరాల్లోనే ఆయన తిండి గింజలను సేకరించి దాచి ఉంచారు. ఇవన్నీ ఒక సంవత్సరానికి సరి పోతాయి. కానీ, వచ్చే సంవత్సరం మాటేమిటి? అప్పటికేదన్నా ఇంత ఆధరువు ఉండాలంటే ఈ సంవత్సరం పంటలు పండాలి కదా !

వానలు లేకపోవడాని కేవో కారణాలుండాలి. అధర్మం ఉన్న చోట లేమి తాండవిస్తుందంటారు. తను బుద్ధిపూర్వకంగా అనుసరించిన అధర్మం కూడా ఏమీ లేదే ! ప్రజలతో పాటు బ్రహ్మదత్తుడు కూడా అతి సాధారణమైన ఆహారమే తీసుకొనేవాడు. శాస్త్రరీత్యా ప్రభువులకు కొన్ని ప్రత్యేక హక్కులున్నాయి. వాటినేమీ ఆయన పాటించదలుచు కోలేదు. తన ప్రజలు ఈ కరువు కాలంలో ఎలా జీవిస్తున్నారో తెలుసుకోవడం కోసం మారువేషంతో బ్రహ్మదత్తుడు సంచారం బయలుదేరాడు. రాజలాంఛనాలతో పర్యటిస్తే సామాన్య ప్రజలను

రాజోద్యోగులు తన దాపుకు రానివ్వరని, ఆ ప్రభువుకు తెలుసు. అతి ప్రయత్నం మీద అంగరక్షకుడు సూత్రం, తన వెంట రావడానికి అంగీకరించాడు. అంగరక్షకుడు కూడా మారువేషం లోనే ఉన్నాడు. ఆ రాత్రి బాగా పొద్దుపోయాక నగరం వెలుపలకు వచ్చాడు బ్రహ్మ దత్తుడు. అక్కడొక ముసలవ్వ ఏడుస్తున్న తన బిడ్డలను సముదాయించ లేక సతమత మవుతున్నది. చెట్టుకింది పొయ్యిలో నిప్పులు ధగ ధగ లాడుతున్నాయి. బ్రహ్మదత్తుడు ఉడుకుతున్న కుండలోకి చూశాడు. ఉత్త నీరే మరుగుతున్నది. ''అది గంజి అని బిడ్డలను మభ్యపెడు తున్నాను నాయనా ; కానీ ఆకలి నా మాటను నమ్మనివ్వడం లేదు'' అన్నది అవ్వ ఏడుస్తూ.

బ్రహ్మదత్తుని గుండెలు అవిసిపోయాయి. సరాసరిగా రాచ నగరుకొచ్చి తిండి గింజల మూటను భుజానికెత్తుకొన్నాడు.

"నేను తెస్తాను ప్రభూ'' అన్నాడు అంగరక్షకుడు.

"వద్దు. రేపు నరకంలో నేను మోయవలసిన పాపభారాన్ని కూడా నీవు మోయలేవు గదా" అన్నాడు బ్రహ్మదత్తుడు. ఆయన స్వయంగా ఆ గింజల మూటను అవ్వకిచ్చాడు. గంజి కాచాడు. ఆ బిడ్డలకిచ్చాడు.

—o—